# నిర్లక్ష్యపు నీడలో ఎంసీహెచ్ పార్కు

- 'బాగు చేయించండి సార్ ఆడుకుంటాం'
- అధికారులను వేడుకుంటున్న చిన్నపిల్లలు

రామవరం, మే 28 : రామవరంలోని మాతాశిశు ఆరోగ్యకేంద్రంలో ఉన్న పార్కుపై నిర్లక్ష్యపు నీడ కమ్ముకుంది. ఆసుపత్రికి వచ్చే చిన్నారులు తాము ఆసుపత్రిలో కాకుండా ఆడుకునే స్థలంలో ఉన్నామనే భావన కలగాలనే ఉద్దేశంతో పార్కును ఏర్పాటు చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పార్కు ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. పర్యవేక్షణ లేకపోవడంతో చిన్నారులు ఆడుకునే వస్తువులు విరిగిపోయాయి. తుమ్మచెట్లు మొలిచి పార్కు మొత్తం తుమ్మవనంగా మారింది. పచ్చనిగడ్డితో ఆహ్లాదపర్చే పార్కుపై కొంచెం శ్రద్ధ తీసుకొని ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదని ఆసుపత్రికి వచ్చే వారు బాధపడుతున్నారు. పైపుల లీకేజీతో పార్కులో ఎక్కడపడితే అక్కడ నీరుపోయి, గుంతలు ఏర్పడి దోమలకు ఆవాసకేంద్రాలుగా మారాయి. పార్కు ఎక్కడ చూసినా బురదమయంగా మారింది. పార్కులో ఉన్న వాటర్ పౌంటేన్ నిరుపయోగంగా ఉండి నాచుతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. ఆసుపత్రికి వచ్చిన వారు దుస్తులు ఆరేసే చాకరేవులా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కుకు పూర్వవైభవం తేవాలని స్థానికులు కోరుతున్నారు.

### తుమ్మవనంగా మారిన వాకింగ్‌ట్రాక్

మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారు, వైద్యసేవలు పొందుతున్న గర్భిణులు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం ఆహ్లాదభరితమైన పార్కును ఏర్పాటుచేశారు. అందులో వాకింగ్ చేసి సేద దీరేందుకు వాకింగ్‌ట్రాక్ సైతం నిర్మించారు. కానీ వాకింగ్‌ట్రాక్ మొత్తం తుమ్మవనంలా మారి నిరుపయోగం ఉంది. పార్కు ఉపయోగంలో ఉంటే సాయంత్రం వేళలో గర్భిణులు, పిల్లలు, బాలింతలు శిశు కేంద్రానికి వచ్చేవారికి ఆటవిడుపుగా ఉండేది.



పార్కులో మొలచిన తుమ్మచెట్లు



పార్కులో విరిగిన కప్‌సాసర్

### అధికారుల పర్యవేక్షణ లేదు



ఆసుపత్రి ప్రారంభమైన కొత్తలో పార్కు చాలా మంచిగా ఉండేది. పిల్లలు, పెద్దలు సాయంత్రంపూట ఇక్కడ కూర్చొనేవాళ్లు. పిల్లల ఆట వస్తువులు ఉండడం వల్ల పార్కు ఎప్పుడూ సందడిగా కనిపించేది. ఇప్పుడు పూర్తిగా అది అడవిగా మారింది. పెద్ద అధికారులు ఎవ్వరూ కూడా ఇటు రాకపోవడంతో ఆసుపత్రి వాళ్లు పట్టించుకోవడం మానేశారు. ఒక్కసారి కలెక్టర్ మేడం వచ్చి చూస్తే మళ్లీ మొదట్లో ఉన్న పార్కు లాగా మారుతుంది.

**– నూతికుర్తి నవీన్‌కుమార్, ఆటోడ్రైవర్ గౌతంపూర్**

### పార్కును బాగు చేయండి సారూ..



ఆసుపత్రికి వచ్చే పిల్లలు పార్కులో ఆడుకునేందుకు మంచిగా ఉండేది. గర్భిణులు కూడా ఈ పార్కులో వాకింగ్ చేసేవారు. ఆటవిడుపుగా సాయంత్రపూట పచ్చనిగడ్డితో పౌంటేన్ వద్ద ఉండేవారు. ఎటుచూసినా పిల్లల సందడి కనిపించేది. ఇప్పుడు ఎటుచూసినా చిన్న పిల్లల ఆట వస్తువులు, పెరిగిన పిచ్చిమొక్కలు, నీరు వృథాగా పోయి బురదగా మారి పందులు, దోమలకు ఆవాసాలుగా మారిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. మళ్లీ మునుపటిలెక్క పార్కును మంచిగా చేస్తే బాగుంటుంది. సార్లు ఒక్కసారి ఆలోచించి పార్కును బాగుచేయాలని కోరుతున్నాను.

**– దారావత్ నాగమణి, గృహిణి, రుద్రంపూర్**

# ఆధార్ అప్‌డేట్‌కు వెళ్లి అనంతలోకాలకు..

- కుక్కను తప్పించబోయి కారు బోల్తా
- ఇద్దరు కూతుళ్లు సహా తల్లి దుర్మరణం
- ప్రాణాపాయస్థితిలో తండ్రి

రఘునాథపాలెం, మే 28 : అనారోగ్యంతో ఉన్న అమ్మను ఆస్పత్రిలో చూపెట్టాలని.. వేసవి సెలవుల్లో తల్లి దండ్రులతో గడపాలని హైదరాబాద్ నుంచి కుటుంబంతో కలిసివచ్చాడు. తల్లి ఆరోగ్యం కాస్త కుదుటపడింది.. పిల్లల సెలవులు కూడా పూర్తి కావొస్తున్నాయి. తిరిగి హైదరాబాద్ వెళ్లాల్సి ఉండగా పనిలోపనిగా పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయించాలనే ఆలోచనతో భార్య, పిల్లలతో కలిసి కారులో ఖమ్మం వెళ్లి తిరిగి వస్తుండగా ఓ కుటుంబాన్ని మృత్యువు వెంటాడింది. కుటుంబంలోని ముగ్గురిని కనిపించని తీరాలకు తీసుకెళ్లింది. ఆ తండ్రికి కన్నీటినే మిగిల్చింది.

రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి పల్టీలు కొట్టింది. దీంతో అందులో ఉన్న తల్లీ, ఇద్దరు కూతుళ్లు అక్కడికక్కడే మృతిచెందగా.. భర్త తీవ్రగాయాలతో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని హర్యాతండా సమీపంలో గల టర్నింగ్ వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది.



ప్రమాదానికి గురైన కారు

కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బావోజీతండాకు చెందిన బోడా ప్రవీణ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఫిజియోథెరపి డాక్టర్‌గా పనిచేస్తూ.. కుటుంబంతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. ప్రవీణ్‌కు భార్య కుమారి(27), ఇద్దరు ఆడపిల్లలు కృషిక(2), క్రితయన(3) ఉన్నారు. కాగా.. ప్రవీణ్ తల్లి ఈరి అనారోగ్యంతో ఉండడంతో 15రోజుల క్రితం ప్రవీణ్ కుటుంబంతో కలిసి ఖమ్మం వచ్చాడు. సెలవుల్లో స్వగ్రామం వచ్చిన ప్రవీణ్, భార్యాపిల్లలు, అమ్మానాన్నలతో కలిసి సంతోషంగా ఉంటున్నాడు. అయితే సెలవులు దగ్గర పడుతుండడంతో తన ఇద్దరి ఆడపిల్లల ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించాలనే ఉద్దేశంతో మంగళవారం భార్య, పిల్లలను తీసుకొని కారులో ఖమ్మం బయలుదేరాడు. ఆధార్‌సెంటర్‌లో కార్డులను అప్‌డేట్ చేయించిన ప్రవీణ్ తిరిగి కారులో కుటుంబంతో కలిసి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో మంచుకొండ దాటి పంగిడి రోడ్డులో ప్రయాణిస్తుండగా హర్యాతండా సమీపంలోని టర్నింగ్ వద్ద రోడ్డుకు అడ్డంగా కుక్క వచ్చింది. దానిని తప్పించే క్రమంలో కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. కారు అదుపుకాకపోవడంతో పల్టీలు కొట్టింది. దీంతో కారులో ఉన్న భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కారు నడుపుతున్న ప్రవీణ్‌కు తీవ్రగాయాలై రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు హుటాహుటిన ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రవీణ్ ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. విషయం తెలుసుకున్న ప్రవీణ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్దఎత్తున ఘటనా స్థలానికి చేరుకొని విగతజీవులుగా పడిన మృతదేహాలపై పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలిసిన రఘునాథపాలెం పోలీసులు ప్రమాదస్థలానికి చేరుకొని మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా.. కారు ప్రమాదంపై మృతురాలు కుమారి కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య ఘర్షణ జరుగుతోందని, ఈ క్రమంలో ప్రమాదంలో మృతి చెందినట్లు వార్త రావడంతో బంధువులు పలు ఆరోపణలు వ్యక్తం చేశారు. అంతపెద్ద ప్రమాదం జరిగినప్పటికీ మృతుల ఒంటిపై ఎలాంటి గాయాలు, రక్తపు మరకలు లేవని ఆరోపిస్తున్నారు.

# రైతులను మోసం చేస్తే జైలుకే..

- వ్యవసాయ అధికారులు, డీలర్ల సమీక్షలో భద్రాద్రి ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న అధికారులు, విత్తనాల డీలర్లు

కొత్తగూడెం క్రైం, మే 28 : రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని మోసం చేయాలని చూస్తే సహించేదిలేదని, క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకి పంపిస్తామని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు హెచ్చరించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు, విత్తనాల డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన, ప్రభుత్వం గుర్తించిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని డీలర్లకు సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాల ప్రాబల్యం గురించి వ్యవసాయశాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగుల మందులను విక్రయిస్తూ రైతులను మోసం చేయాలని చేస్తే జైలుకి పంపిస్తామన్నారు. పోలీస్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తూ పక్కా సమాచారంతో మోసగాళ్లపై దాడులు నిర్వహించాలన్నారు. మేలైన విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని, బిల్లులు జాగ్రత్తగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించామని, వారిద్వారా మండలాల వారిగా వ్యవసాయ అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎవరైనా తక్కువ ధరకు విత్తనాలు అమ్మాలని చూస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైతులను కోరారు. రైతులు అప్రమత్తంగా ఉండి 100కు డయల్ చేసి తెలపాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు, పోలీస్ అధికారులు, విత్తనాల డీలర్లు పాల్గొన్నారు

# 'పచ్చిరొట్ట' కోసం పాట్లు..



పచ్చిరొట్ట విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

అన్నపురెడ్డిపల్లి, మే 28 : సీజన్‌కు ముందు భూసారం కోసం వినియోగించే పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు నానా పాట్లు పడుతున్నారు. పనులన్నీ పక్కన పెట్టి మంగళవారం ఉదయం నుంచే విత్తనాల కోసం పరుగులు పెట్టిన రైతులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన సొసైటీ కార్యాలయం ఎదుట బారులు తీరారు. సొసైటీ పరిధిలోని రైతులకు సరిపడా విత్తనాలు రాకపోవడంతో కొందరు రైతులు పొద్దంతా ఎదురుచూసి ఖాళీ చేతులతో ఇంటిబాట పట్టారు. ఇంతదూరం వస్తే విత్తనాలు దొరకలేదని గొణుక్కున్నారు. అయితే 500 క్వింటాళ్లకు 250 క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే రావడంతో అవి ఏ మూలకూ సరిపోలేదు. అదనపు విత్తనాల కోసం ఇండెంట్ పెట్టామని, రాగానే అందరికీ పంపిణీ చేస్తామని ఏడీఏ అఫ్జల్ బేగం రైతులకు సర్ది చెప్పారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

కొత్తగూడెం క్రైం, మే 28 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా గోగుండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య మంగళవారం ఎదురుకాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు డీఆర్‌జీ బలగాలు గోగుండా అటవీ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరపడంతో భద్రతా దళాలు ఎదురుకాల్పులకు దిగినట్లు తెలుస్తోంది. పది నిమిషాలపాటు ఇరువర్గాలు తలపడినట్లు సమాచారం. కాగా.. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు పారిపోయాయి. ఈ ఘటనలో మావోయిస్టు పార్టీకి చెందిన మిలీషియా సభ్యులు పాల్గొన్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీరిలో పలువురికి బుల్లెట్ గాయాలైనట్లు సమాచారం. అయితే ఎదురుకాల్పుల్లో జవాన్లతో తలపడింది మిలీషియా సభ్యులా? కాదా? అనే విషయం తేలాల్సి ఉంది. ఈ ఘటనలో ఎవరైనా మరణించారా? లేదా గాయాలతో బయటపడ్డారా? అనే పూర్తి వివరాలను అక్కడి పోలీసు అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

## వాణిజ్యం



### 2.9 లీటర్లకు 100 కిలోమీటర్లు

#### బీవైడీ హైబ్రిడ్ కారు

షాంఘై, మే 28: చైనాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం బీవైడీ..హైబ్రిడ్ టెక్నాలజీతో తయారైన నయా మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 2.9 లీటర్ల ఇంధనంతో 100 కిలోమీటర్లు ప్రయాణించే వాహనాన్ని షాంఘై వేదికగా కంపెనీ చైర్మన్ వాంగ్ చౌహాన్‌ఫూ ప్రవేశపెట్టారు. పూర్తిస్థాయిలో బ్యాటరీ చార్జింగ్‌తోపాటు పూర్తి గ్యాలోలైన్ ట్యాంక్‌తో 2000 కిలోమీటర్లకు పైగా ప్రయాణించనున్నది. ఈ హైబ్రిడ్ మాడల్ ప్రారంభ ధర 79,800 యూవాన్(11 వేల అమెరికా డాలర్లు) ఉండనున్నది.

### వెండి వెలుగులు

#### *3,100 పెరిగిన కిలో ధర*

న్యూఢిల్లీ, మే 28: వెండి వెలుగులు పంచింది. గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన వెండి మంగళవారం ఏకంగా రూ.3 వేలకు పైగా పెరిగింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.3,100 ఎగబాకి రూ.95,950 కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.92,850గా ఉన్నది. వెండితోపాటు బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. తులం పుత్తడి ధర రూ.130 పెరిగి రూ.72,950కి చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.220 అందుకొని రూ.72,930కి, 22 క్యారెట్ ధర రూ.200 ఎగబాకి రూ.66,850కి చేరుకున్నది. కిలో వెండి మాత్రం రూ. 3,500 ఎగబాకి రూ.1,01,000 వద్ద నిలిచింది.

### అమర రాజా ఆకర్షణీయం

న్యూఢిల్లీ, మే 28: గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ.230 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది అమర రాజా బ్యాటరీస్. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 62 శాతం వృద్ధిని కనబరిచింది. ఆదాయం రూ.2,433 కోట్ల నుంచి రూ.2,908 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, ప్రతిషేరుకు రూ. 5.10 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది.

# ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ!

- సంకేతాలిచ్చిన కంపెనీ చైర్మన్ సిద్ధార్థ



న్యూఢిల్లీ, మే 28: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ..ఆరోగ్య బీమా రంగంలోకి అడుగుపెట్టే ఆలోచనలో ఉన్నది. ఈ విషయాన్ని కంపెనీ చైర్మన్ సిద్ధార్థ మోహంతీ సూచనప్రాయంగా వెల్లడించారు. బీమా రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు, దీంట్లోభాగంగానే ఆరోగ్య బీమా రంగంలోకి ప్రవేశించాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం బీమా చట్టం సవరించడం ద్వారా కంపోజిట్ లైసెన్స్‌ను అనుమతించే అవకాశాలున్నాయి. బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ మార్గదర్శకాలకు లోబడి బీమా చట్టం-1938 ప్రకారం ప్రస్తుతం లైఫ్, జనరల్ లేదా ఆరోగ్య బీమా సేవలు అందించడానికి సంస్థలకు వీలులేదు. కానీ, బీమా చట్టాన్ని సవరించే ప్రతిపాదనను ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. దీంట్లోభాగంగానే ఒకే సంస్థకు అన్ని రకాల సేవలు అందించడానికి వీలుపడనున్నది. దీనిపై ఆయన మాట్లాడుతూ..ఆరోగ్య బీమా రంగంలోకి వచ్చే దానిపై అంతర్గతంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఒకే సంస్థకు లైఫ్, జనరల్ లేదా హెల్త్ బీమా సేవలు అందించడానికి అవసరమైన లైసెన్స్‌లు మంజూరు చేయాలని పార్లమెంటరీ ప్యానెల్ సూచించిన విషయం తెలిసిందే. ఇందుకోసం బీమా చట్టాల్లో మార్పులు చేయాలని సూచించింది. ఒకేతాటిపైకి అన్ని రకాల బీమా సేవలు అందించడంతో పాలసీదారుడికి ఆర్థిక ప్రయోజనాలు కలగడంతోపాటు సమయం ఆదాకానున్నది. సింగిల్ పాలసీతో లైఫ్, హెల్త్, పొదుపు సేవలు అందించడానికి వీలు పడనున్నదని కమిటీ సూచించింది.

# డెడ్‌లైన్ ఈ నెలాఖరే




**మే 31కల్లా ఆధార్‌తో పాన్ అనుసంధానం కాకపోతే అధిక టీడీఎస్ కోతలు**
**ట్యాక్స్‌పేయర్స్‌ను హెచ్చరించిన ఐటీ శాఖ**

న్యూఢిల్లీ, మే 28: ఈ నెలాఖరుకల్లా పన్ను చెల్లింపుదారులు తమ ఆధార్‌తో పాన్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని ఆదాయ పన్ను (ఐటీ) శాఖ మంగళవారం స్పష్టం చేసింది. మే 31లోగా ట్యాక్స్‌పేయర్స్ తమ ఆధార్-పాన్‌ను లింక్ చేసుకోకపోతే జూన్ 1 నుంచి టీడీఎస్ అధిక రేటుతో కట్ అవుతుందని హెచ్చరించింది. కనుక అధిక పన్ను కోతల నుంచి తప్పించుకోవాలంటే ఈ శుక్రవారంలోపు ఆధార్‌తో పాన్ లింకయ్యేలా చూసుకోవాలని కోరింది. ఐటీ నిబంధనల ప్రకారం ట్యాక్స్‌పేయర్స్‌కు చెందిన పర్మనెంట్ అకౌంట్ నంబర్ (పాన్), బయోమెట్రిక్ ఆధార్‌తో అనుసంధానం జరుగకపోతే అందరికీ వర్తించే ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్ (టీడీఎస్) రేటుకు రెట్టింపు స్థాయిలో పన్ను కోతలుంటాయి. కాగా, గత నెల ఏప్రిల్‌లోనే మే 31కల్లా ఆధార్‌తో పాన్‌ను పన్ను చెల్లింపుదారులు జత చేసినట్టైతే టీడీఎస్ షార్ట్ డిడక్షన్‌కు ఎలాంటి చర్యలు ఉండబోవని కూడా ఐటీ శాఖ ఓ సర్క్యులర్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. 'దయచేసి మీ పాన్‌తో మీ ఆధార్‌ను ఈ నెల 31లోగా లింక్ చేసుకోండి. ఇలా చేసుకోకపోతే రెట్టింపు రేటుతో టీడీఎస్‌ను చెల్లించాల్సి వస్తుంది' అని ఐటీ శాఖ తమ అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది.

ఎస్ఎఫ్‌టీ గడువుపై..

బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు, ఫారెక్స్ డీలర్లు, సబ్-రిజిస్ట్రార్, పోస్టాఫీసులు, బాండ్లు/డిబెంచర్ల జారీదారులు, మ్యూచువల్ ఫండ్ ట్రస్టీలు, డివిడెండ్లు చెల్లించే కంపెనీలు, షేర్లను బైబ్యాక్ చేస్తున్న సంస్థలు మే 31కల్లా స్టేట్‌మెంట్ ఆఫ్ స్పెసిఫైడ్ ఫైనాన్షియల్ ట్రాన్జాక్షన్స్ (ఎస్ఎఫ్‌టీ) రిటర్న్స్‌ను దాఖలు చేయాలని మరో 'ఎక్స్' పోస్ట్‌లో ఐటీ శాఖ కోరింది. లేకపోతే జరిమానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. గడువు దాటితే రోజుకు రూ.1,000 చొప్పున ఫైన్ పడుతుందని హెచ్చరించింది. కాగా, ఎస్ఎఫ్‌టీలతో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలను జరిపే వ్యక్తులపై ఐటీ శాఖ దృష్టి సారించడానికి వీలుంటుంది. తద్వారా పన్ను ఎగవేతలను అరికడుతుంది.

# అమ్మేస్తున్నారు..

## అమ్మకానికి బీఎస్ఎన్ఎల్-ఎంటీఎన్ఎల్ ఆస్తులు

- దేశవ్యాప్తంగా 600లకుపైగా భూములు, భవనాలను గుర్తించిన కేంద్రం
- ఆసక్తి ఉన్నవారి కోసం వెబ్‌సైట్ తెచ్చామన్న టెలికం శాఖ
- దాదాపు రూ.25,000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా




న్యూఢిల్లీ, మే 28: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), మహానగర్ టెలీఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్) ఆస్తులను పెద్ద ఎత్తున అమ్మేయాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు నిర్ణయించింది. ఈ క్రమంలోనే టెలికం శాఖ దేశవ్యాప్తంగా ఈ ఇరు ప్రభుత్వ రంగ టెలికం సంస్థలకున్న ఆస్తులను గుర్తించింది. ఇందులో 600లకు పైగా భూములు, భవనాలున్నట్టు తేలింది. వీటన్నిటినీ కూడా వివిధ ప్రభుత్వ శాఖలకు, సర్కారీ సంస్థలకు, ప్రభుత్వ భాగస్వామ్యమున్న కంపెనీలకు పూర్తిగా అమ్మేయాలని చూస్తున్నారు. తద్వారా సుమారు రూ.25,000 కోట్ల ఆదాయం రావచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, బీఎస్ఎన్ఎల్‌కు చెందిన రూ.18,200 కోట్ల ఆస్తులను, ఎంటీఎన్ఎల్‌కు చెందిన రూ.5,158 కోట్ల విలువైన 6 ఆస్తులను అమ్మేందుకు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ అనుమతిచ్చినట్టు కమ్యూనికేషన్స్, ఐటీపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి గత ఏడాదే టెలికం శాఖ తెలియజేసింది.

*'బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లకు చెందిన ఆస్తులను అమ్మేస్తున్నాం. ఈ సమాచారాన్ని మీ అందరికీ తెలియజేస్తున్నాం. ఆస్తుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చాం. ఆసక్తిగలవారు చూడవచ్చు' అని వివిధ మంత్రిత్వ శాఖల్లోని సంస్థలకు టెలికం శాఖ కార్యదర్శి మిట్టల్ లేఖ రాశారు.*

- *దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్‌కు ఆస్తులు.*
- *వివిధ రాష్ట్రాల్లో 530కిపైగా భవనాలు, భూములున్నట్టు గుర్తించిన టెలికం శాఖ.*
- *ఢిల్లీ, ముంబైల్లో మాత్రమే ఎంటీఎన్ఎల్‌కు ఆస్తులు. అయినప్పటికీ ప్రధాన ప్రాంతాల్లోనే 100 ప్రాపర్టీలు.*
- *ఢిల్లీలో 48, మహారాష్ట్రలో 52 ఆస్తులను కలిగి ఉన్న ఎంటీఎన్ఎల్.*

### పునరుద్ధరణ పేరుతో..

బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వీటి పునరుద్ధరణ పేరుతో ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సంస్థాగత ఆస్తులను పూర్తిగా అమ్మేయాలని చూస్తున్నది. నిజానికి 2019లోనే ఈ తంతుకు బీజం పడింది. బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ పునరుద్ధరణ ప్రణాళికకు కేంద్ర క్యాబినెట్ కూడా ఆమోదం తెలుపగా.. ఇందులో ఆయా సంస్థల మిగులు భూములు, భవనాల వంటి ఆస్తుల నగదీకరణ కూడా ఉన్నది.

### ప్రభుత్వ తీరుపై విమర్శలు

బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ నష్టాలకు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలే కారణమన్న విమర్శలు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. సేవను మరిచి ఆదాయమే పరమావధిగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వాలు.. ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు స్పెక్ట్రం కేటాయింపుల్లో పెద్దపీట దక్కేలా చేశాయని మండిపడుతున్నారు. ప్రైవేట్ కంపెనీలు 5జీ, 6జీ అంటూ పరుగులు పెడుతుంటే.. ప్రభుత్వ టెలికం సంస్థలు మాత్రం 4జీ దగ్గరే పడిగాపులు కాస్తున్నాయని గుర్తుచేస్తున్నారు. రెండు సంస్థలనూ ఆదుకునేందుకు ప్యాకేజీలను ప్రకటించినా.. వాటి అమలులో మాత్రం చిత్తశుద్ధిని సర్కారీ పెద్దలు చూపడం లేదని ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు. 2019లో ఈ ఇరు సంస్థల పునరుద్ధరణకు కేంద్రం రూ.69,021 కోట్లతో ఓ ప్యాకేజీని తెచ్చిన సంగతి విదితమే. ఇక 2022లో సుమారు రూ.1.64 లక్షల కోట్లతో మరో పునరుద్ధరణ ప్యాకేజీని మోదీ సర్కారు తీసుకొచ్చింది. అయినప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. చివరకు ఆయా సంస్థల ఆస్తులను అమ్మి, వాటి రుణాలను తీరుస్తామని కేంద్రం చెప్తుండటం సర్వత్రా విస్మయానికి గురిచేస్తున్నది.



# ఫలితాలకు ముందు అప్రమత్తత

## *వరుసగా మూడోరోజూ నష్టపోయిన స్టాక్ మార్కెట్లు*

ముంబై, మే 28: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చేవారం విడుదలకానుండటంతో మదుపరుల్లో టెన్షన్ నెలకొన్నది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో వరుసగా మూడోరోజు మంగళవారం సూచీలు నష్టపోయాయి. పవర్, ఆయిల్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురికావడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 220 పాయింట్లు నష్టపోయి 75,170.45 వద్ద స్థిరపడింది. 75,585 నుంచి 75,083 శ్రేణిలో కదలాడిన సూచీలు చివరకు నష్టాల్లోకి జారుకున్నాయి. అటు ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 44.30 పాయింట్లు కోల్పోయి 22,888.15 వద్దకు పడిపోయింది. ఎన్నికల ఫలితాల వరకు స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకుల్లో కొనసాగనున్నాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, టాటా మోటర్స్‌లు ఒక్క శాతానికిపైగా నష్టపోయాయి.
- వీటితోపాటు టెక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్, మారుతి, ఐటీసీ, కొటక్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, నెస్లే, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, సన్‌ఫార్మాలు కూడా పతనం చెందాయి.
- కానీ, ఏషియన్ పెయింట్స్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీలు ఆకట్టుకున్నాయి.
- బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు నష్టాల్లో ట్రేడయ్యాయి.
- రియల్టీ రంగ షేర్లు అత్యధికంగా 2.22 శాతం నష్టపోగా..పవర్ 1.86 శాతం, యుటిలిటీ 1.55 శాతం, సేవలు 1.37 శాతం, టెలికమ్యూనికేషన్ 1.26 శాతం, ఇండస్ట్రీయల్స్ 1.08 శాతం, క్యాపిటల్ గూడ్స్ షేర్లు తగ్గాయి.

### డిసెంబర్ నాటికి 24,500కి నిఫ్టీ

ఈ ఏడాది చివరినాటికి నిఫ్టీ 24,500 పాయింట్లకు చేరుకునే అవకాశం ఉన్నదని ఎంకీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ అంచనావేస్తున్నారు. ఇదే క్రమంలో వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి 26,500 పాయింట్లను అధిగమించవచ్చునని అభిప్రాయపడింది. ప్రస్తుతం 22,888 పాయింట్ల స్థాయిలో ఉన్నది. ఇటీవల రికార్డు స్థాయి 23,110 పాయింట్లకు చేరుకున్న విషయం తెలిసిందే.

### జీ-సెక్ లావాదేవీలకు మొబైల్ యాప్

ముంబై, మే 28: రిజర్వు బ్యాంక్ కీలక నిర్ణయాలు తీసుకున్నది. గవర్నమెంట్ సెక్యూరిటీ(జీ-సెక్) మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్లు పాల్గొనేందుకు వీలుగా ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యక్తిగత లేదా సంస్థలు పలు రెగ్యులేటరీ అనుమతుల కోసం 'ప్రవాహ్' పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఈ పోర్టల్‌తో రెగ్యులేటరీ అనుమతులతోపాటు రిజర్వు బ్యాంక్‌కు సంబంధించిన అన్ని క్లియరెన్స్‌లు త్వరితగతంగా జరగనున్నాయి. ఈ యాప్ ఆండ్రాయిడ్ యూజర్లు ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

### లాభాల్లో మెడ్‌ప్లస్

హైదరాబాద్, మే 28: ప్రముఖ ఫార్మా సంస్థ మెడ్‌ప్లస్ లాభాల్లో కొనసాగుతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.1,490 కోట్ల ఆదాయంపై రూ. 33.4 కోట్ల లాభాన్ని గడించింది. ఆదాయంలో 19 శాతం వృద్ధిని కనబరిచిన సంస్థ..లాభంల్లో 25.6 శాతం పెరుగుదల కనిపించింది.